గురువారం
THURSDAY
5-11-2026

సంపుటి (Volume):2 || సంచిక: (Issue): 127

జగిత్యాల
JAGITIAL

పేజీలు: (PAGES):12
వెల (PRICE): 2.00

Circulated to Telangana
Published from Jagitial

PRGI REGD NO: TGTEL/25/A1385

www.evarthalu.com

నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక





10 మంది రెస్క్యూ సిబ్బంది గల్లంతు

మత్స్యకారులను కాపాడేందుకు వెళ్లగా విషాదం.. ఖమ్మం జిల్లా బేతుపల్లి పెద్ద చెరువు వద్ద ఘటన

తెలంగాణలో భారీ వర్షాల నేపథ్యంలో ఖమ్మం జిల్లాలో తీవ్ర విషాదకర ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో చిక్కుకున్న మత్స్యకారులను కాపాడేందుకు వెళ్లిన రెస్క్యూ సిబ్బందే వరద ప్రవాహంలో గల్లంతు కావడం సంచలనంగా మారింది. సత్తుపల్లి మండలం బేతుపల్లి పెద్ద చెరువు వద్ద రెండు బోట్లు నీటి ఉద్ధృతికి పల్టీలు కొట్టడంతో 10 మంది ఎస్‌డీఆర్‌ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది గల్లంతయ్యారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

ఖమ్మం, నవంబర్ 4 (ఈవార్తలు): భారీ వర్షాల కారణంగా బేతుపల్లి పెద్ద చెరువు అలుగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఈ క్రమంలోనే చేపలు బయటకు వెళ్లకుండా వలలు ఏర్పాటు చేసేందుకు వెళ్లిన మత్స్యకారులు వరద నీటిలో చిక్కుకున్నారు. మత్స్యకారులను వారిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు అధికారులు రెస్క్యూ బృందాలను రంగంలోకి దించారు. మొదట ముగ్గురు అగ్నిమాపక సిబ్బంది ఒక బోటులో మత్స్యకారుల వద్దకు వెళ్లారు. అయితే మార్గమధ్యలో బోటు మొరాయించడంతో వారే ప్రమాదంలో చిక్కుకున్నారు. దీంతో కొత్తగూడెం నుంచి ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బందిని, తరువాయి 2 వ పేజీలో...



అమెరికాలో.. నేడు తుపాను!

ట్రంప్‌కు అమెరికన్ల భారీ షాక్

సెనేట్, ప్రతినిధుల సభ డెమోక్రాట్ల వశం.. రిపబ్లికన్ల కంచుకోట బద్దలు

సత్తా చాటిన భారత సంతతి అభ్యర్థులు.. వివేక్ రామస్వామికి ఎదురుదెబ్బ

అమెరికా మధ్యంతర ఎన్నికల్లో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రిపబ్లికన్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. నవంబర్ 3న జరిగిన ఎన్నికల్లో ప్రతిపక్ష డెమోక్రాట్లు అద్భుత విజయం సాధించి యూఎస్ సెనేట్, ప్రతినిధుల సభ రెండింటిపై పూర్తి నియంత్రణను సాధించారు. రిపబ్లికన్ల కంచుకోటగా ఉన్న ఉత్తర కరొలినా, దక్షిణ కరొలినా, టెక్సాస్, కాన్సాస్, అయోవా, ఒహియో వంటి కీలక రాష్ట్రాల్లోని సెనేట్ స్థానాలను డెమోక్రాట్లు కైవసం చేసుకున్నారు.

వాషింగ్టన్: ట్రంప్ తన రెండో విడత అధ్యక్ష పదవిలో తీసుకున్న కొన్ని ఆర్థిక విధానాలు, టారిఫ్‌లు, ఇరాన్ యుద్ధ ప్రభావం వల్ల ఓటర్లు ఆయనపై తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు ఎగ్జిట్ పోల్స్ స్పష్టం చేశాయి. తాజా ఫలితాలు ట్రంప్ స్వయంగా ప్రచారం నిర్వహించిన రాష్ట్రాల్లో కూడా రిపబ్లికన్ అభ్యర్థులు ఓటమి పాలవడం ట్రంప్ నాయకత్వంపై తీవ్ర ప్రజా వ్యతిరేకతను పెంచాయి. ఈ ఎన్నికల్లో భారత సంతతికి చెందిన తరువాయి 2 వ పేజీలో...





భారత్‌తో బంధం ప్రత్యేకం

హోర్ముజ్‌లో స్వేచ్ఛా ప్రయాణం

ఇరాన్ మినహాయింపు

టెహ్రాన్: ప్రపంచ చమురు, సరుకు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి గుండా నౌకాయానంలో భారత్‌కు భారీ ఉపశమనం లభించింది. ఈ వ్యూహాత్మక జలమార్గం గుండా వెళ్లే నౌకలపై తాము విధించిన ఆంక్షల నుండి భారత్‌కు మినహాయింపు ఇస్తున్నట్లు ఇరాన్ ప్రభుత్వం స్పష్టం చేసింది. భారత్‌తో పాటు చైనా, ఇరాక్, ఖతార్ దేశాలకు చెందిన నౌకలు ఎలాంటి అడ్డంకులు లేకుండా స్వేచ్ఛగా ప్రయాణించవచ్చని టెహ్రాన్ ప్రకటించింది. ఇరాన్ పార్లమెంట్ జాతీయ భద్రత, విదేశాంగ విధాన కమిటీ ఉపాధ్యక్షుడు అహ్మద్ హయత్-మొఘద్దం ఉన్నత స్థాయి సమావేశంలో మాట్లాడుతూ, ఈ నాలుగు దేశాల నౌకల రాకపోకలపై ఎలాంటి నిషేధం తరువాయి 2 వ పేజీలో...



అగ్నివీరులకు మరో రెండేళ్లు సర్వీసు పొడిగింపు

న్యూఢిల్లీ: అగ్నిపథ్ పథకం కింద సైన్యంలో చేరిన అగ్నివీరులకు కేంద్ర ప్రభుత్వం కీలక వెసులుబాటు కల్పించింది. ఇప్పటికే ఉన్న నాలుగేళ్ల సర్వీసుకు అదనంగా మరో రెండేళ్లు పొడిగించాలని నిర్ణయించింది. తొలి బ్యాచ్ అగ్నివీరుల పదవీకాలం ముగియనున్న తరుణంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ నిర్ణయం ప్రకారం, నాలుగేళ్ల సేవ తర్వాత సాధారణ విధానంలో శాశ్వత సైనికులుగా ఎంపిక కాని మిగిలిన 75 శాతం అగ్నివీరులకుతరువాయి 2 వ పేజీలో...



ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లల నిబంధన సరికాదు

సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: ఎన్నికల్లో పోటీ చేయాలంటే ఇద్దరు పిల్లలకు మించి ఉండకూడదనే నిబంధన ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతవరకు సమంజసమని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. దేశంలో సంతానోత్పత్తి రేటు గణనీయంగా తగ్గిన నేపథ్యంలో ఇద్దరికి మించి పిల్లలున్నవారిని స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయకుండా తరువాయి 2 వ పేజీలో...



రైతు భరోసా.. అబద్ధం!

రైతుల ఫోన్లకు నకిలీ సందేశాలు

పోలీసులకు వ్యవసాయశాఖ ఫిర్యాదు

హైదరాబాద్, నవంబర్ 4 (ఈవార్తలు): రైతు భరోసా పథకం పేరుతో రైతులకు వస్తున్న నకిలీ సందేశాలపై వ్యవసాయ శాఖ అప్రమత్తమైంది. రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అయినట్లు వస్తున్న సందేశాలు వాస్తవం కాదని స్పష్టం చేసింది. ఈ సందేశాలను రాష్ట్ర వ్యవసాయ -2 వ పేజీలో...

బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

(గ్రాము-24 క్యారెట్స్):	రూ.14,280
వెండి (కిలో):	రూ.2,10,000
ప్లాటినం (గ్రాము):	రూ.4,2391

విశ్వవాణి



అమెరికాలోని ఫ్లోరిడా రాష్ట్రం పేద కుటుంబాలకు అందించే సంక్షేమ నగదు వినియోగంపై కఠిన ఆంక్షలు విధించింది. ఈ సాయంతో ఎలక్ట్రానిక్ సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులు, పచ్చబొట్లు, వీడియో గేమ్స్, వినోద పార్కుల టికెట్లు కొనుగోలు చేయడాన్ని నిషేధించింది. తక్కువ ఆదాయం కలిగిన కుటుంబాలకు ఆర్థిక సాయం అందించే తాత్కాలిక నగదు సహాయ పథకం (టీసీఏ) కింద ఈ కొత్త నిబంధనలను ప్రకటించింది. ఇది అమెరికా సమాఖ్య స్థాయి పేద కుటుంబాల సహాయ కార్యక్రమం 'టీఏఎన్ఎఫ్' పరిధిలో అమలవుతోంది. కొత్త నిబంధనల ప్రకారం సంక్షేమ నగదుతో స్పా సేవలు, చర్మవర్ణాన్ని మార్చే సౌందర్య సేవలు, అశ్లీల వినోదం, మాదకద్రవ్యాలు, ఇతర నిషేధిత వస్తువులు, సేవల కోసం ఖర్చు చేయకూడదు.



డోర్ క్లోజ్ చేశాకే బస్సు కదలాలి

బస్ కండక్టర్ ప్రవళిక మృతి నేపథ్యంలో టీజీఎస్ ఆర్టీసీ ఆదేశాలు

హైదరాబాద్, నవంబర్ 4 (ఈవార్తలు): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో కండక్టర్ ప్రవళిక ప్రమాదవశాత్తు జారిపడి ప్రాణాలు కోల్పోయిన విషాదకర ఘటనపై తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ తక్షణమే దిద్దుబాటు చర్యలకు శ్రీకారంతరువాయి 2 వ పేజీలో...

బాలుడి దత్తతకు చట్టబద్ధతేది?

చిన్నారిని శిశుగృహకు అప్పగించాలి.. ఉత్తర్వులను పునఃసమీక్షించాలి.. హైకోర్టులో జగిత్యాల కలెక్టర్ పిటిషన్

జగిత్యాల బాలుడి దత్తత వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల మేరకు చిన్నారిని పెంపుడు తల్లిదండ్రులకు అప్పగించినప్పటికీ వివాదం సద్దుమణగలేదు. బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించాలని ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.



జగిత్యాల/హైదరాబాద్, నవంబర్ 4 (ఈవార్తలు): గత ఉత్తర్వులపై స్టే విధించి, చిన్నారిని తిరిగి చైల్డ్ వెల్ఫేర్ కమిటీ (సీడబ్ల్యూసీ)కి అప్పగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని జంబిగద్దెకు చెందిన సరిత, శ్రీనివాస్‌గౌడ్ దంపతులకు సంతానం లేకపోవడంతో మూడేళ్ల క్రితం కోరుట్లకు చెందిన ఓ దంపతుల నుంచి నెల రోజుల తరువాయి 2 వ పేజీలో...

ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి

2.21 లక్షల కుటుంబాలతో రేవంత్ సర్కార్ పండుగ



హైదరాబాద్, నవంబర్ 4 (ఈవార్తలు): తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇళ్లలో ఈసారి దీపావళి వేడుకలు ప్రత్యేకంగా జరగనున్నాయి. పేదల సొంతింటి కలను సాకారం చేసే లక్ష్యంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా గృహప్రవేశాలు పూర్తిచేసుకున్న కుటుంబాలతో కలిసి పండుగ జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ' మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి ' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా పాల్గొని లబ్ధిదారుల ఆనందంలో భాగస్వాములు కావాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి తరువాయి 2 వ పేజీలో...

ఏఐతో భూ వివాదాల పరిష్కారమా?

జనగామ కలెక్టర్‌పై హైకోర్టు ఆగ్రహం.. ఉత్తర్వులు సస్పెండ్

హైదరాబాద్, నవంబర్ 4 (ఈవార్తలు): భూ వివాదాల పరిష్కారంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగంపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. భూమి హక్కులకు సంబంధించిన కేసుల్లో నిజానిజాలను పరిశీలించకుండా.. సంబంధిత వ్యక్తుల వాదనలు వినకుండా ఏఐ ఆధారంగా ఉత్తర్వులు జారీ చేయడంపై తీవ్ర అభ్యంతరం తెలిపింది. ఓ భూ వివాదంలో జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.. ఏఐ రూపొందించిన సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ఆదేశాలు ఇచ్చారన్న ఆరోపణలపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపివేస్తూ, బాధ్యుల వివరణ కోరింది. ఈ వ్యవహారంపై జనగామ జిల్లా దేవరుప్పుల తరువాయి 2 వ పేజీలో...

రాశి ఫలాలు

5.11.2026

మేషం: నూతన వాహనం కొనుగోలు చేస్తారు. వృత్తి ఉద్యోగాలలో అధికారులను సైతం మీ పనితీరుతో ఆకట్టుకుంటారు. ఆకస్మిక ధనప్రాప్తి కలుగుతుంది. వ్యాపారమున విశేషమైన లాభాలు అందుతాయి. కొన్ని సంఘటనలు ఆశ్చర్యం కలిగిస్తాయి. సమాజంలో పేరు కలిగిన వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి.

వృషభం: దూర ప్రయాణాలలో మార్గావరోధాలు కలుగుతాయి. ఆర్థికపరంగా ఇబ్బందులు తప్పవు. వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. నూతన వ్యాపార విస్తరణ ప్రయత్నాలు మందగిస్తాయి. బంధు మిత్రులతో మాట పట్టింపులుంటాయి. ఉద్యోగమున అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి.

మిథునం: ఆర్థిక పరంగా అనుకూల పరిస్థితులు ఉంటాయి. ఆప్తుల నుండి విలువైన సమాచారం అందుతుంది. ఉద్యోగస్తులకు పదోన్నతులు పెరుగుతాయి. వ్యాపార విషయమై కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. కుటుంబ సభ్యులతో వివాదాలు సర్దుమణుగుతాయి.

కర్కాటకం: సన్నిహితులతో దైవ దర్శనాలు చేసుకుంటారు. కుటుంబ సభ్యులకు మీ ఆలోచనలు నచ్చే విధంగా ఉంటాయి. చేపట్టిన పనులలో జాప్యం కలిగినప్పటికీ నిదానంగా పూర్తి చేస్తారు. వృత్తి వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. నిరుద్యోగుల ప్రయత్నాలు మందకొడిగా సాగుతాయి. స్థిరాస్తి ఒప్పందాలు అంతగా కలిసిరావు.

సింహం: వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. దైవ అనుగ్రహంతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. కుటుంబ సభ్యులతో చిన్నపాటి మాట పట్టింపులు ఉంటాయి. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు వాయిదా పడతాయి. వృత్తి ఉద్యోగాలలో అదనపు పని భారం వలన తగిన విశ్రాంతి లభించదు. దైవ చింతన పెరుగుతుంది.

కన్య: బంధు మిత్రులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలున్నవి. నిరుద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి. ఉద్యోగస్తులకు ఊహించని స్థాన చలనాల కలుగుతాయి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. వ్యాపార వ్యవహారాలు నిరుత్సాహ పరుస్తాయి.

తుల: ఆరోగ్య విషయంలో వైద్యుల సంప్రదింపులు అవసరం అవుతాయి. ఇంటా బయట గందరగోళ పరిస్థితులు ఉంటాయి. ఒక వ్యవహారంలో జీవిత భాగస్వామితో వివాదాలు కలుగుతాయి. విద్యార్థుల పరీక్ష ఫలితాలు నిరుత్సాహపరుస్తాయి. ఉద్యోగులకు పని ఒత్తిడి పెరుగుతుంది. అవసరానికి చేతిలో డబ్బు నిలువ ఉండదు.

వృశ్చికం: ఆదాయ మార్గాలు విస్తృతమవుతాయి. దూర ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో సహోద్యోగుల సహాయ సహకారాలతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. చేపట్టిన పనులలో అవరోధాలు తొలగుతాయి. దీర్ఘకాలిక ఋణ ఒత్తిడి నుండి ఉపశమనం కలుగుతుంది. నిరుద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి.

ధనస్సు: కుటుంబ పెద్దల నుండి ఊహించని సమస్యలు కలుగుతాయి. సంతాన ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించాలి. బంధు మిత్రులతో స్వల్ప వివాదాలు కలుగుతాయి. వృత్తి ఉద్యోగాలలో అదనపు బాధ్యతల వలన తగిన విశ్రాంతి ఉండదు. వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

మకరం: ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. ఋణ యత్నాలు మందగిస్తాయి. మాతృ వర్గ బంధువులతో మాటపట్టింపులు ఉంటాయి. ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. రావలసిన సొమ్ము సకాలంలో చేతికి అందక ఇబ్బందులు ఎదుర్కొంటారు.

కుంభం: ఇంటా బయట పరిస్థితులు అనుకూలంగా ఉంటాయి. కుటుంబ సభ్యులతో శుభకార్య విషయమై చర్చలు చేస్తారు. వృత్తి ఉద్యోగాలలో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. నిరుద్యోగులకు సన్నిహితుల సహాయ సహకారాలతో నూతన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. వ్యాపారాలలో నూతన పద్ధతులను అవలంబించి లాభాలు అందుకుంటారు.

మీనం: ఉద్యోగమున అధికారులతో వాదనలకు వెళ్లకపోవడం మంచిది. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. వృత్తి వ్యాపారాలు సమస్యాత్మకంగా ఉంటాయి. నేత్ర సంభందమైన అనారోగ్య సమస్యలు భాదిస్తాయి. కొన్ని వ్యవహారాలలో ఇతరుల నుండి వ్యతిరేకత తప్పదు.

అమెరికాలో.. నీలి తుఫాను!

మొదటి పేజీ తరువాయి

అభ్యర్థులు తమ సత్తా చాటారు. డెమోక్రాటిక్ పార్టీకి చెందిన సుహాస్ సుబ్రమణ్యం మరోసారి ప్రతినిధుల సభకు (హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్) ఎన్నికయ్యారు. వర్జీనియా రాష్ట్రంలోని 10వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి రిపబ్లికన్ అభ్యర్థి దేవ్ బెకెవిత్‌పై ఆయన విజయం సాధించారు. సుహాస్‌కు 61.5 శాతానికిపైగా ఓట్లు రాగా, ప్రత్యర్థికి 36.4 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. 2024లో తొలిసారి ఇదే నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌కు ఎన్నికైన సుహాస్ తాజా విజయంతో తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. భారత సంతతికే చెందిన పియా దాండియా ఫ్లోరిడా నుంచి తొలిసారి ప్రతినిధుల సభకు ఎన్నికయ్యారు. ఫ్లోరిడాలోని 22వ కాంగ్రెషనల్ డిస్ట్రిక్ట్ నుంచి 51.9 శాతం ఓట్లు సాధించి రిపబ్లికన్ అభ్యర్థి కేసీ అస్గర్‌పై (49.1 శాతం) విజయం సాధించారు. దీంతో ఫ్లోరిడా నుంచి అమెరికా దిగువ సభకు ఎన్నికైన తొలి భారతీయ-అమెరికన్ మహిళగా ఆమె చరిత్ర సృష్టించారు. మేరీల్యాండ్ లెఫ్టినెంట్ గవర్నర్ అరుణా మిల్లర్ కూడా తన పదవిని నిలబెట్టుకున్నారు. అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్‌కు పోటీగా నిలబడి చివరి నిమిషంలో రేసు నుంచి తప్పుకున్న భారత సంతతి నేత వివేక్ రామస్వామికి ఈ ఎన్నికల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఒహియో గవర్నర్ ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థిగా బరిలోకి దిగిన రామస్వామి.. అక్కడ డెమోక్రాట్ అభ్యర్థి అమీ ఆక్టన్ చేతిలో ఏకంగా రెండు లక్షల ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు. వైద్యురాలైన అమీ ఆక్టన్ గతంలో ఒహియో ఆరోగ్య శాఖ డైరెక్టర్‌గా పనిచేశారు. రాష్ట్ర ప్రజల జీవన వ్యయం, ఆర్థిక పరిస్థితులు, పాలనా అంశాలను ప్రచారంలో ప్రముఖంగా ప్రస్తావించారు. చివరకు ఆమె విజయం సాధించడంతో 2006 తర్వాత తొలిసారిగా ఒహియోలో డెమోక్రాటిక్ పార్టీకి గవర్నర్ పదవి దక్కినట్లైంది. రో ఖన్నా, ప్రమీలా జయపాల్, అమీ బేరా వంటి భారత సంతతి అభ్యర్థులు కూడా తిరిగి కాంగ్రెస్‌కు ఎన్నికయ్యేందుకు మెరుగైన అవకాశాలు కనిపిస్తున్నాయి. అమెరికా రాజకీయాల్లో భారతీయ మూలాలున్న నేతల ప్రాతినిధ్యం పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఫలితాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అమెరికా ప్రతినిధుల సభలోని మొత్తం 435 స్థానాలకు, 100 మంది సభ్యులున్న సెనెట్‌లోని సెనేట్‌లోని 35 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఎగువ సభలో ఇప్పటికే 34 మంది డెమోక్రాట్లు, 31 మంది రిపబ్లికన్లు ఉన్నారు. మిగతా 35 స్థానాలకు మిడ్ టర్మ్‌లో పోలింగ్ జరిగింది. సెనేట్‌లో మెజారిటీ సాధించడానికి కనీసం 51 స్థానాలు అవసరం కాగా, డెమొక్రాట్లు ఆ మార్కును దాటి స్పష్టమైన ఆధిక్యతను సాధించారు. వీటితోపాటూ అమెరికాలోని మొత్తం 50 రాష్ట్రాలకు గానూ 36 రాష్ట్రాల్లో గవర్నర్ పదవులకు ఎన్నికలు నిర్వహించారు.

ట్రంప్ నిర్ణయాలపై వ్యతిరేకత

అధ్యక్షుడిగా ట్రంప్ కొనసాగుతున్నప్పటికీ, ఆయన నిర్ణయాలను ప్రశ్నించే, అడ్డుకునే రాజకీయ శక్తి కాంగ్రెస్ (పార్లమెంట్)లో పెరగడం ఈ ఎన్నికల ప్రధాన పరిణామం. నవంబర్ 3న జరిగిన ఎన్నికల్లో ప్రతినిధుల సభలోని మొత్తం 435 స్థానాలకు, సెనేట్‌లో 35 స్థానాలకు, 36 రాష్ట్రాల గవర్నర్ పదవులకు పోలింగ్ జరిగింది. ఈ ఎన్నికలు అధ్యక్ష ఎన్నికలు కావు. అయినప్పటికీ అమెరికా అధ్యక్షుడి రెండేళ్ల పాలనపై ప్రజలు ఇచ్చే మధ్యంతర తీర్పుగా వీటికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. అధికారంలో ఉన్న పార్టీకి మధ్యంతర ఎన్నికల్లో ఎదురుగాలి వీచడం అన్న సంప్రదాయం ఈసారి మరింత స్పష్టంగా కనిపించింది. ఈ ఎన్నికల్లో డెమోక్రాట్లకు అనుకూలంగా ప్రజాభిప్రాయం మారడానికి ప్రధాన కారణాల్లో ఆర్థిక పరిస్థితులు ఒకటి. నిత్యావసర వస్తువుల ధరలు, ద్రవ్యోల్బణం, ఇంధన ధరలు, జీవన వ్యయం అమెరికా ఓటర్లను తీవ్రంగా ప్రభావితం చేశాయి. దీనికి తోడు ఇరాన్‌తో యుద్ధం, వలస విధానాలు, వాణిజ్య సుంకాలు, ప్రభుత్వ నిర్ణయాలపై వివాదాలు ఎన్నికల ప్రచారంలో కీలకంగా మారాయి. ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పుడు అమెరికా ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తామని, అమెరికా ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ సామాన్య అమెరికన్లకు జీవన వ్యయం తగ్గకపోవడం, అంతర్జాతీయ సంఘర్షణల ప్రభావం, ప్రభుత్వ విధానాలపై అసంతృప్తి రిపబ్లికన్లకు ప్రతికూలంగా మారాయి. ఎన్నికల అనంతరం వెలువడిన ఎగ్జిట్‌పోల్ విశ్లేషణల్లోనూ ఇదే అంశం స్పష్టమైంది. అధిక ధరలు, దేశం పయనిస్తున్న దిశపై అసంతృప్తి, ట్రంప్ ప్రభుత్వ పనితీరుపై వ్యతిరేకత ఓటర్ల నిర్ణయాన్ని ప్రభావితం చేశాయి. దాదాపు సగం మంది ఓటర్లు ఈ ఎన్నికలను అధ్యక్షుడికి వ్యతిరేకంగా తమ అసంతృప్తిని వ్యక్తం చేసే అవకాశంగా భావించినట్లు తెలుస్తోంది.

బాలుడి దత్తతకు చట్టబద్ధతేది?

మొదటి పేజీ తరువాయి

వయసున్న శిశువును తీసుకుని పెంచుకుంటున్నారు. తల్లి మరణించిన ఆ చిన్నారిని తమ బిడ్డగానే భావిస్తూ అల్లారుముద్దుగా చూసుకుంటున్నారు. అయితే ఆస్తి తగాదాల నేపథ్యంలో శ్రీనివాస్‌గౌడ్ బంధువులు బాలుడి దత్తత చట్ట బద్ధంగా జరగలేదని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు సెప్టెంబర్ 16న చిన్నారిని దంపతుల నుంచి తీసుకుని కరీంనగర్ శిశుగృహకు తరలించారు. దీంతో చిన్నారిని తమకు అప్పగించాలంటూ సరిత, శ్రీనివాస్ దంపతులు హైకోర్టును ఆశ్రయించారు. వారి పిటిషన్‌ను పరిశీలించిన న్యాయస్థానం అక్టోబర్ 16న బాలుడిని పెంపుడు తల్లిదండ్రులకు అప్పగించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అయితే అప్పగింతలో జాప్యం జరగడంతో దంపతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. శిశుగృహలో చిన్నారిని కలిసేందుకు వెళ్లిన సమయంలో 'డాడీ.. ఇంటికి తీసుకెళ్లు.. అమ్మా.. నన్ను తీసుకెళ్లు.. భయమేస్తోంది' అంటూ బాలుడు రోదించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ నేపథ్యంలో అధికారు లు హైకోర్టు ఉత్తర్వులను అమలు చేసి చిన్నారిని దంపతులకు అప్పగించారు. దీంతో రెండు నెలలుగా బిడ్డకు దూరంగా ఉన్న ఆ దంపతుల ఇంట్లో ఆనందం నెలకొంది.

హైకోర్టు ఉత్తర్వులపై కలెక్టర్ అభ్యంతరం

చిన్నారిని అప్పగించిన తర్వాత తాజాగా కలెక్టర్ సత్యప్రసాద్ హైకోర్టును ఆశ్రయించడం ఈ వ్యవహారంలో కొత్త మలుపుగా మారింది. సీడబ్ల్యూసీ నిబంధనలు, అధికారులు సమర్పించిన ఆధారాలను పూర్తిగా పరిశీలించకుండానే బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారని కలెక్టర్ తన పిటిషన్‌లో పేర్కొన్నట్లు సమాచారం. హిందూ సంప్రదాయం ప్రకారం దత్తత తీసుకున్నంత మాత్రాన దానిని చట్టబద్ధమైన దత్తత ప్రక్రియగా పరిగణించవచ్చా? అనే అంశాన్ని పరిశీలించాలని కోర్టును కోరారు. గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పునఃపరిశీలించే వరకు బాలుడిని తిరిగి శిశు సంక్షేమ కేంద్రానికి అప్పగించాలని కలెక్టర్ కోరారు. చిన్నారి తల్లిదండ్రుల వద్ద ఉంటే విచారణకు ఆటంకం కలిగే అవకాశం ఉందని పిటిషన్‌లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తూ ఇచ్చిన ఉత్తర్వులపై స్టే విధించాలని, చిన్నారిని తిరిగి సీడబ్ల్యూసీ సంరక్షణలోకి పంపాలని కోరుతూ కలెక్టర్‌తోపాటు సంబంధిత అధికారులు రిట్ పిటిషన్ దాఖలు చేశారు.

భారత్‌తో బంధం ప్రత్యేకం

మొదటి పేజీ తరువాయి

ఉండదని అధికారికంగా ధ్రువీకరించారు. ఈ మినహాయింపుల వెనుక నిర్దిష్టమైన దౌత్య, మానవీయ కారణాలు ఉన్నాయని ఇరాన్ వెల్లడించింది. ముఖ్యంగా భారత్ నుండి అవసరమైన ఔషధాలు, వైద్య పరికరాల దిగుమతులకు ఎటువంటి ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతోనే అవకాశం కల్పించినట్లు తెలిపింది. ఇక చైనాతో ఉన్న బలమైన రాజకీయ మద్దతు, ద్వైపాక్షిక ఆర్థిక సంబంధాల దృష్ట్యా నిబంధనలను సడలించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో, భారత వాణిజ్య నౌకల భద్రతకు, ఇంధన సరఫరాకు ఈ నిర్ణయం ఎంతో కీలకమైనదిగా మారింది.

అగ్నివీరులకు మరో రెండేళ్లు సర్వీసు పొడిగింపు

మొదటి పేజీ తరువాయి



మరో రెండేళ్లు పనిచేసే అవకాశం లభించనుంది. ఈ పొడిగించిన సేవ పూర్తయ్యాక కూడా ప్రతిభ ఆధారంగా సాధారణ సైనిక విభాగంలో చేరేందుకు అవకాశం కల్పిస్తామని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ ఎన్.ఎస్. రాజా సుబ్రమణి వెల్లడించారు. అగ్నిపథ్ పథకం 2022లో ప్రారంభమైంది. ప్రస్తుతం ఈ పథకం కింద సైన్యం, నౌకాదళం, వాయుసేనల్లో నాలుగేళ్ల కాలానికి నియామకాలు చేపడుతున్నారు. ఈ గడువు ముగిసిన తర్వాత ప్రతి బ్యాచ్‌లో గరిష్ఠంగా 25 శాతం మందిని ప్రతిభ, సైనిక దళాల అవసరాల ఆధారంగా సాధారణ సర్వీసులో కొనసాగించే అవకాశం ఉంది. మిగిలినవారు విధుల నుంచి వైదొలగాల్సి వచ్చేది. తాజా నిర్ణయంతో వారికి అదనపు సేవా అవకాశం లభించనుంది. నియామక ప్రక్రియలోనూ మార్పులు ప్రకటించారు. ఇకపై శారీరక పరీక్షకు ముందుగా రాత పరీక్ష నిర్వహించనున్నారు. సైన్యంలో పనిచేసిన సమయంలో అగ్నివీరులు పొందిన శిక్షణ, నైపుణ్యాలను గుర్తిస్తూ ధ్రువపత్రాలు కూడా అందించనున్నారు. తొలి బ్యాచ్‌లో సుమారు 18 వేల మంది అగ్నివీరుల నాలుగేళ్ల సర్వీసు గడువు 2026 డిసెంబరులో ముగియనుండటంతో ఈ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది.

రైతు భరోసా.. అబద్ధం!

మొదటి పేజీ తరువాయి

శాఖ అనుమానాస్పద కార్యకలాపాలుగా గుర్తించి, సైబర్ నేరాల విభాగానికి ఫిర్యాదు చేసింది. గత రెండు రోజులుగా జిల్లాలోని పలు వురు రైతుల సెల్‌ఫోన్లకు రైతు భరోసా నిధులు జమ అయినట్లు సందేశాలు వస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేరుతో వస్తున్న ఓ సందేశంలో ఎకరాకు రూ.12 వేల చొప్పున రైతు భరోసా అందిస్తున్నట్లు పేర్కొంటూ, ఓ రైతు ఖాతాలో రూ.9,825 జమ అయినట్లు చూపించారు. ఈ సందేశాలను నిజమని నమ్మిన రైతులు బ్యాంకులు, ఏటీఎంలకు వెళ్లి ఖాతా నిల్వను పరిశీలించగా నగదు జమ కాలేదని గుర్తించి అయోమయానికి గురయ్యారు. ఈ వ్యవహారంపై వ్యవసాయ శాఖ అధికారిక ప్రకటన విడుదల చేసింది. . రైతు భరోసా నిధులు జమ అయినట్లు ప్రచారంలో ఉన్న సందేశాలు వాస్తవం కాదని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ వీటిని అనుమానాస్పద కార్యకలాపాలుగా గుర్తించిందని, దీనిపై సైబర్ నేరాల విభాగానికి ఫిర్యాదు చేసినట్లు పేర్కొంది. రైతులు ఇలాంటి సందేశాలను నమ్మవద్దని, వాటిలో వచ్చే అనుమానాస్పద లింకులను తెరవకూడదని సూచించింది. బ్యాంకు ఖాతా వివరాలు, ఒకసారి వినియోగించే సంకేత సంఖ్య (ఓటీపీ), ఏటీఎం పిన్, ఆధార్ సమాచారం వంటి వ్యక్తిగత వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని, అనుమానాస్పద ఫోన్ కాల్స్, సందేశాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపింది.

ఏఐతో భూ వివాదాల పరిష్కారమా?

మొదటి పేజీ తరువాయి

మండలం పెద్దమడూరు గ్రామానికి చెందిన మేడిపల్లి కొమురయ్య హైకోర్టును ఆశ్రయించారు. తన భూ వివాదానికి సంబంధించి ప్రత్యర్థులు సమర్పించిన ఫిర్యాదుపై జిల్లా కలెక్టర్ సెప్టెంబర్ 8వ తేదీన ఉత్తర్వులు జారీ చేశారని పిటిషనర్ తెలిపారు. అయితే తన వాదనలను వినకుండా.. సంబంధిత భూమి రికార్డులు, వాస్తవాలను పూర్తిస్థాయిలో పరిశీలించకుండానే ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఏఐ టూల్స్‌ను ఉపయోగించి ఉత్తర్వులు తయారు చేశారని.. అధికారులు తమ సొంత విచక్షణతో వ్యవహరించలేదని పిటిషనర్ తరఫు లాయర్ ఎం. మాధవరెడ్డి హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ నిర్ణయం వల్ల తనకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయని వాదించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎన్‌వి శ్రవణ్ కుమార్ విచారణ చేపట్టారు. ఆస్తి హక్కులు, భూములకు సంబంధించిన వివాదాల్లో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సామాన్య ప్రజలు, రైతులపై తీవ్ర ప్రభావం పడుతుందని వ్యాఖ్యానించారు. కేవలం ఏఐతో రూపొందించిన సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ఇలాంటి కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకోవడం సరికాదని అభిప్రాయపడ్డారు. కేసులోని వాస్తవాలను స్వయంగా పరిశీలించడం, సంబంధిత పత్రాలను అధ్యయనం చేయడం, బాధితుల వాదనలు వినడం అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు.. జనగామ కలెక్టర్ సెప్టెంబర్ 8వ తేదీన జారీ చేసిన ఉత్తర్వులను తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ వ్యవహారంపై రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి, జనగామ జిల్లా కలెక్టర్, దేవరుప్పుల తహసీల్దార్‌తో పాటు సంబంధిత ప్రైవేటు వ్యక్తులకు నోటీసులు జారీ చేసింది. వారి వివరణలు సమర్పించాలని ఆదేశించింది. రెవెన్యూ శాఖ తరఫున హాజరైన అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ హరిత.. ఈ అంశం ప్రభుత్వం దృష్టికి వచ్చిందని కోర్టుకు తెలిపారు. రెవెన్యూ వ్యవహారాలను చూసే ప్రభుత్వ లాయర్ ఈ విషయంలో తదుపరి చర్యలపై సలహా కోరుతూ అడ్వకేట్ జనరల్ కార్యాలయాన్ని సంప్రదించినట్లు వివరించారు. ఈ వ్యవహారంలో బాధ్యులైన అధికారులపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకోబోయే చర్యలేమిటో వివరించాలని అడ్వకేట్ జనరల్ ఏ. సుదర్శన్ రెడ్డిని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను నవంబర్ 18వ తేదీకి వాయిదా వేసింది. అన్నట్లు జనగామ కలెక్టర్.. సిరిసిల్ల కలెక్టర్‌గా పనిచేసిన కాలంలో పలు వివాదాలతో వార్తల్లో నిలిచారు. దాంతో ఆయనపై ప్రభుత్వం బదిలీ వేటు వేసిన విషయం తెలిసిందే.

ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి

మొదటి పేజీ తరువాయి

శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ఆర్థిక సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ పేదలకు సొంతింటి కలను నిజం చేయాలనే సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని కొనసాగిస్తోందని మంత్రి పొంగులేటి తెలిపారు. తొలి విడతలో 4.50 లక్షల ఇళ్లను మంజూరు చేయగా.. అందులో ఇప్పటివరకు 2,21,500 ఇళ్లు పూర్తి చేసి.. గృహప్రవేశాలు కూడా పూర్తయ్యాయని వెల్లడించారు. మరో 1.90 లక్షల ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో దీపావళి రోజున ప్రతి నియోజకవర్గంలో గృహప్రవేశాలు పూర్తిచేసుకున్న ఇందిరమ్మ ఇళ్ల వద్ద ప్రత్యేక వేడుకలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. లబ్ధిదారుల కుటుంబాలతో కలిసి ప్రజాప్రతినిధులు దీపాలు వెలిగించి పండుగ జరుపుకోవాలని మంత్రి పొంగులేటి కోరారు. పేదల ఇంట్లో వెలిగే ప్రతి దీపం ప్రజా ప్రభుత్వ సంకల్పానికి ప్రతీకగా నిలవాలని ఆకాంక్షించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

10 మంది రెస్క్యూ సిబ్బంది గల్లంతు

మొదటి పేజీ తరువాయి

అదనంగా ఫైర్ సిబ్బందిని రప్పించారు. రెండు బోట్లలో వెళ్లిన రెస్క్యూ బృందాలు తొలుత ప్రమాదంలో చిక్కుకున్న ముగ్గురు ఫైర్ సిబ్బందిని సురక్షితంగా వెనక్కి తీసుకొచ్చాయి. అనంతరం మిగిలిన మత్స్యకారులను రక్షించేందుకు రెండు బోట్లలో సిబ్బంది మరోసారి చెరువులోకి వెళ్లారు. ఈ క్రమంలో చెరువు అలుగు నుంచి వస్తున్న వరద ప్రవాహం, నీటి ఉద్ధృతికి రెండు బోట్లు అదుపుతప్పి పల్టీలు కొట్టాయి. దీంతో వాటిలో ప్రయాణిస్తున్న 10 మంది ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది నీటిలో గల్లంతయ్యారు. మత్స్యకారుల ప్రాణాలు కాపాడేందుకు వెళ్లిన సిబ్బందే ప్రమాదంలో చిక్కుకోవడంతో స్థానికంగా ఆందోళన నెలకొంది. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్, ఎమ్మెల్యే మట్టా రాగమయి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గల్లంతైన 10 మంది సిబ్బంది ఆచూకీ కోసం సహాయక చర్యలను పర్యవేక్షించారు. భద్రాచలం నుంచి ఎన్డీఆర్ఎఫ్ బృందాలను కూడా రప్పించారు. మరో బోటు సహాయంతో చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. అవసరమైన చోట్ల డ్రోన్ల ద్వారా లైఫ్ జాకెట్లు పంపించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. వరద ప్రవాహం తీవ్రంగా ఉండటంతో సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. బేతుపల్లి చెరువులో బోట్లు బోల్తాపడి 10 మంది రెస్క్యూ సిబ్బంది గల్లంతైన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరా తీశారు. సిబ్బందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. సహాయక చర్యలను ఎప్పటికప్పుడు సమీక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకు సూచించారు. మరోవైపు.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు కూడా రెస్క్యూ ఆపరేషన్‌ను దగ్గరుండి పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. మత్స్యకారుల ప్రాణాలు కాపాడేందుకు వెళ్లిన సిబ్బందే ప్రమాదంలో చిక్కుకోవడంతో వారి కుటుంబ సభ్యులు, స్థానికులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గల్లంతైన 10 మంది సిబ్బంది ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లల నిబంధన సరికాదు

మొదటి పేజీ తరువాయి

అనర్హులుగా ప్రకటించే చట్టాలను పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. గత రెండు దశాబ్దాల్లో దేశ జనాభా పరిస్థితుల్లో గణనీయమైన మార్పులు వచ్చాయని బుధవారం విచారణ సందర్భంగా ధర్మాసనం పేర్కొంది. ప్రస్తుతం భారతదేశ మొత్తం సంతానోత్పత్తి రేటు (టీఎఫ్ఆర్) 2.1 అనే ప్రత్యామ్నాయ స్థాయి కంటే దిగువకు పడిపోయిందని గుర్తుచేసింది. ఇదే పరిస్థితి కొనసాగితే రాబోయే దశాబ్దాల్లో వృద్ధుల జనాభా పెరిగే అవకాశాలున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఇద్దరికి మించి పిల్లలున్నవారు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిషేధించడం ఇప్పటికీ అవసరమా? అని ప్రశ్నించింది. మహారాష్ట్రలోని కాకోడా గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ మంగళ భీమ్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. మూడో సంతానం జన్మించడంతో ఆమెను ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హురాలిగా ప్రకటించారు. ఆమె అప్పీల్‌ను అనుమతించిన సుప్రీంకోర్టు, అనర్హత నిర్ణయాన్ని రద్దు చేసింది. ఇదే అంశంపై 2003లో వెలువడిన జావేద్ వర్సెస్ హర్యానా రాష్ట్రం తీర్పును కూడా సుప్రీంకోర్టు పునఃపరిశీలనకు స్వీకరించింది. ఆ తీర్పును విస్తృత ధర్మాసనానికి నివేదించింది. హర్యానా పంచాయతీరాజ్ చట్టం-1994 ప్రకారం ఇద్దరికి మించి పిల్లలున్నవారు పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులని అప్పట్లో ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన ధర్మాసనం సమర్థించింది. 2003లో ఆ తీర్పు వెలువడినప్పుడు దేశంలో ఒక్కో మహిళకు సగటున ముగ్గురు పిల్లలు ఉండేవారని, జనాభా నియంత్రణ ప్రధాన విధానపరమైన అంశంగా ఉండేదని ప్రస్తుత ధర్మాసనం గుర్తుచేసింది.

డోర్ క్లోజ



రేవంత్ రెడ్డి బ్రోకర్

కమల్ హాసన్, రజనీకాంత్‌ను మించి భట్టి నటన

హిల్ట్ పాలసీలో భూములు కొంటే ఇబ్బందులు తప్పవు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 4 (ఈవార్తలు): భూములు అమ్ముకునే బ్రోకర్ రేవంత్ రెడ్డిని సీఎం చేశారు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క.. సినీ నటులు కమల్ హాసన్, రజనీకాంత్‌ను మించి ఎన్నికల్లో నటించారని విమర్శించారు. శేరిలింగంపల్లి నుంచి బీఆర్ఎస్ పార్టీలో చేరికల సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ వాళ్లు కహానీలు చెప్పారు. ఇంటింటికి గ్యారెంటీ కార్డులు పంచారు. అయినా కూడా హైదరాబాద్ నగరంలో ప్రజలు బీఆర్ఎస్ పార్టీని గెలిపించారు. రేవంత్ రెడ్డికి లొల్లి, కొవ్వు ఎక్కువ. మియాపూర్‌లో 550 ఎకరాల భూమిపై సుప్రీంకోర్టులో తీర్పు వస్తే ఆ భూమిని అమ్ముతా అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. రేవంత్ రెడ్డి సోదరుడు, మంత్రులు వివేక్ వెంకటస్వామి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి చెరువు శిఖంలో ఇళ్ళు కట్టుకోవచ్చు. హైడ్రాతో ఎవరికి ఉపయోగం జరిగింది. భూముల విలువ పడిపోయింది అని కేటీఆర్ పేర్కొన్నారు. హిల్ట్ పాలసీ పేరుతో రేవంత్ రెడ్డి లావాదేవీలు చేసుకుని 10 వేల ఎకరాలు అమ్మాలనే కుట్ర చేస్తున్నారు. ఎర్రవెల్లిలో అమరవీరులకు ఇల్లు కట్టిస్తా అని సీఎం అంటున్నారు. అమరవీరుల కుటుంబాలకు మియాపూర్‌లో ఇల్లు కట్టి ఇవ్వు సీఎం రేవంత్ రెడ్డి. ఎవరైనా పారిశ్రామికవేత్తలు రేవంత్ రెడ్డి ఉచ్చులో పడి హిల్ట్ పాలసీలో భూములు కొంటే ఇబ్బందులు తప్పవు. సంవత్సరంలోగా కేసీఆర్ సీఎం కాబోతున్నారు. హిల్ట్ పాలసీ భూములకు చెక్ పెడతాం. హౌసింగ్ బోర్డు భూములు, వక్ఫ్ భూములు రేవంత్ రెడ్డి అమ్ముతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. బండి సంజయ్ కరీంనగర్ ఇజ్జత్ తీస్తున్నారు. బండి సంజయ్‌కు కేంద్ర మంత్రి అనే సోయి లేదు. రేవంత్ రెడ్డిని ప్రియాంక గాంధీ సెక్యూరిటీ తోసివేశారు. ఢిల్లీ పార్టీల వద్ద మన వాళ్లకు ఉన్న విలువ ఇది. ఢిల్లీ వాళ్ళతో తెలంగాణకు ఉపయోగం లేదు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు అమిత్ షా కాళ్ళు మొక్కారు. అమిత్ షా తెలంగాణకు వచ్చి చేతులు ఊపి వెళ్లారు. కాంగ్రెస్ ఢిల్లీకి సంచులు మోసే పార్టీ.. బీజేపీ ఢిల్లీ వాళ్ళ చెప్పులు మోసే పార్టీ అని కేటీఆర్ విమర్శించారు.

23న ఏపీలో మేయర్, ఛైర్‌పర్సన్‌ల ప్రమాణం

విజయవాడ, నవంబర్ 4 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల ముగిసిన పురపాలక ఎన్నికల ప్రక్రియలో మరో కీలక ఘట్టానికి రంగం సిద్ధమైంది. రాష్ట్రంలోని నూతనంగా ఎన్నికైన మేయర్లు, మున్సిపల్ ఛైర్‌పర్సన్‌ల ప్రమాణ స్వీకారానికి రాష్ట్ర ఎన్నికల సంఘం ముహూర్తం ఖరారు చేసింది. ఈ నెల 23న వారు తమ బాధ్యతలను అధికారికంగా స్వీకరించనున్నారని ఎస్ఈసీ స్పష్టం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 13 కార్పొరేషన్లు, 77 మున్సిపాలిటీలు, 10 నగర పంచాయతీల్లో ఎన్నికల ఫలితాలు వెలువడిన సంగతి తెలిసిందే. ప్రజలు నేరుగా తమ నగర సారథులను ఎన్నుకోవడంతో, గెలుపొందిన అభ్యర్థులు ప్రమాణ స్వీకారం చేసేందుకు ఎస్ఈసీ తేదీని ఖరారు చేస్తూ తాజా ఉత్తర్వులు జారీ చేసింది. దీనితో కొత్త పాలకవర్గాల ఏర్పాటు ప్రక్రియ వేగవంతం కానుంది. అయితే, డిప్యూటీ మేయర్లు, వైస్ ఛైర్‌పర్సన్‌ల ఎన్నికపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ పదవుల ఎన్నికకు సంబంధించిన తేదీలు, విధివిధానాలపై ఎస్ఈసీ నుంచి ప్రత్యేకంగా ప్రకటన వెలువడాల్సి ఉంది. గతంలో ఈ పదవులను పరోక్ష పద్ధతిలో కౌన్సిలర్లు ఎన్నుకునేవారు. అయితే, ఇప్పుడు మేయర్లు, ఛైర్‌పర్సన్ల ఎన్నిక ప్రత్యక్ష పద్ధతిలో జరిగినందున, డిప్యూటీ పదవుల ఎన్నిక ప్రక్రియకు సంబంధించి ఎస్ఈసీ కొత్త మార్గదర్శకాలను జారీ చేయనున్నట్లు తెలుస్తోంది. నవంబరు 23న మేయర్లు, ఛైర్‌పర్సన్‌లు బాధ్యతలు చేపట్టినప్పటికీ, పూర్తిస్థాయి పాలకవర్గాల ఏర్పాటుకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉంది. ఎస్ఈసీ నుంచి తదుపరి ఆదేశాలు వెలువడిన తర్వాతే డిప్యూటీ మేయర్లు, వైస్ ఛైర్‌పర్సన్‌ల ఎన్నిక ప్రక్రియ ప్రారంభం కానుంది. అప్పటివరకు ఈ అంశంపై ఉత్కంఠ కొనసాగనుంది.

ఈడీ విచారణకు అంబటి రాంబాబు హాజరు



హైదరాబాద్, నవంబర్ 4 (ఈవార్తలు): వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు హైదరాబాద్‌లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. మద్యం రవాణా కుంభకోణం కేసులో మనీలాండరింగ్ ఆరోపణలపై ఆయన వాంగ్మూలాన్ని అధికారులు నమోదు చేస్తున్నారు. ఈ కేసులో విచారణకు రావాలని గతంలోనే ఈడీ అంబటికి నోటీసులు ఇచ్చింది. అయితే, తనకు ఇటీవల గుండెకు స్టెంట్లు వేశారని, అనారోగ్య కారణాలతో హాజరుకాలేనని ఆయన వైద్య నివేదికలతో పాటు సమాచారం ఇచ్చారు. ఈ నేపథ్యంలో, నవంబర్ 4న తప్పనిసరిగా విచారణకు రావాలని ఈడీ మరోసారి నోటీసులు జారీ చేయడంతో ఆయన హైదరాబాద్‌లోని కార్యాలయానికి వచ్చారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం రవాణా టెండర్లలో భారీగా అవకతవకలు జరిగాయని, దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.195 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని ఏపీ సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ ఈ కేసులో దర్యాప్తు చేస్తోంది. కొందరికి అనుకూలంగా టెండర్ నిబంధనలు మార్చారని ప్రధాన ఆరోపణగా ఉంది. ఈ కేసులో ఇప్పటికే గత వైసీపీ ప్రభుత్వ మాజీ ఐటీ సలహాదారు కెసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి, ఏపీఎస్‌బీసీఎల్ మాజీ ఎండీ దొంతిరెడ్డి వాసుదేవ రెడ్డి, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఆయన కుమారుడు సునీల్ కుమార్‌లను ఈడీ అరెస్ట్ చేసింది. గతంలో నోటీసులు అందుకున్నప్పుడు "తాను ఏ తప్పూ చేయలేదని, విచారణకు పూర్తిగా సహకరిస్తానని" అంబటి రాంబాబు పేర్కొన్న విషయం తెలిసిందే.

పోలవరం–బనకచర్లతో తెలంగాణకు అన్యాయం

250 టీఎంసీల గోదావరి జలాలను చంద్రబాబుకు గురుదక్షిణ.. సీఎం రేవంత్‌రెడ్డిపై టీఆర్ఎస్ చీఫ్ కవిత ధ్వజం



హైదరాబాద్, నవంబర్ 5 (ఈవార్తలు): పోలవరం--బనకచర్ల లింక్ ప్రాజెక్టుకు అంగీకారం తెలపడం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెలంగాణ నీటి ప్రయోజనాలను ఆంధ్రప్రదేశ్‌కు తాకట్టు పెడుతోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత విమర్శించారు. గోదావరిలో తెలంగాణకు దక్కాల్సిన 250 టీఎంసీల నీటిని తన రాజకీయ గురువు చంద్రబాబుకు రేవంత్‌రెడ్డి గురుదక్షిణగా సమర్పిస్తున్నారని ఆరోపించారు. జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీఏ) ఆధ్వర్యంలో జరిగిన దక్షిణాది రాష్ట్రాల మండలి సమావేశంలో పోలవరం--బనకచర్ల ప్రాజెక్టుకు కాంగ్రెస్ ప్రభుత్వం అంగీకారం తెలిపిందని ఆమె పేర్కొన్నారు. గోదావరి-కావేరి నదుల అనుసంధానాన్ని సమ్మక్క సాగర్ (తుపాకులగూడెం) నుంచి చేపట్టాలని కూడా ఆ సమావేశంలో అధికారులు కోరినట్లు బుధవారం సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో చేసిన పోస్టులో వెల్లడించారు. బనకచర్ల ప్రాజెక్టుకు అనుకూలంగా నదుల అనుసంధానం జరిగేలా రేవంత్‌రెడ్డి సహకరిస్తున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ఆమోదంతోనే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పోలవరం--బనకచర్ల లింక్ ప్రాజెక్టును నదుల అనుసంధానంలో భాగంగా చేపట్టేందుకు కేంద్రంపై ఒత్తిడి తెస్తోందని కవిత విమర్శించారు. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి నిర్వహించిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రుల సమావేశంలోనూ రేవంత్‌రెడ్డి ఈ ప్రాజెక్టుకు అంగీకారం తెలిపారని ఆరోపించారు. అయితే మీడియా ముందు మాత్రం ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నట్లు చెబుతూ తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టు తెలంగాణ నీటి హక్కులను దెబ్బతీస్తుందని తమ సంస్థ మొదటి నుంచీ హెచ్చరిస్తోందని కవిత గుర్తు చేశారు. . అయినప్పటికీ ప్రభుత్వానికి కనీస అవగాహన లేకుండా పోయిందని విమర్శించారు. ఒకవైపు ప్రాజెక్టును వ్యతిరేకిస్తున్నామని చెబుతూ మరోవైపు దానికి సహకరించడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. నదీ జలాల వినియోగంపై ప్రభుత్వానికి కనీస అవగాహన లేకపోవడం, నిర్దిష్ట విధానం లేకపోవడం తెలంగాణకు శాపంగా మారిందని వ్యాఖ్యానించారు. పోలవరం-బనకచర్ల లింక్ ప్రాజెక్టుతో తెలంగాణకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని కవిత అందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వాస్తవాలను గుర్తించి, ఈ ప్రాజెక్టుపై కేంద్రం చేపడుతున్న అన్ని సంప్రదింపుల నుంచి తెలంగాణ ప్రభుత్వం వైదొలగాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టును అడ్డుకోవాలని కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి లేఖ రాయాలని సూచించారు. తెలంగాణ నీటి హక్కులకు భంగం కలిగించే ఏ చర్యనూ సహించబోమని హెచ్చరించారు.

మహిళా కండక్టర్ ప్రవళిక మృతి

బాధ్యులపై కఠిన చర్యలు తప్పవన్న మంత్రి పొన్నం

హైదరాబాద్, నవంబర్ 4 (ఈవార్తలు): ప్రయాణికురాలితో జరిగిన ఘర్షణలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న టీఎస్ఆర్టీసీ మణుగూరు డిపో మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక (24) మృతి చెందారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పది రోజులుగా చికిత్స పొందుతున్న ఆమె, తుదిశ్వాస విడిచారు. ఈ ఘటనపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రవళిక మరణం తనను తీవ్రంగా కలచివేసిందని మంత్రి అన్నారు. "ప్రవళిక కోలుకుని తిరిగి వస్తుందని ఆశించాం. కానీ ఆమె మృతి చెందడం చాలా బాధాకరం. ఆమె కుటుంబానికి ప్రభుత్వం, ఆర్టీసీ అండగా ఉంటుంది. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం" అని ఆయన స్పష్టం చేశారు. అక్టోబర్ 25న మణుగూరు నుంచి భద్రాచలం వెళ్తున్న బస్సులో టికెట్ విషయంలో ప్రయాణికురాలు బానోతు మౌనికతో ప్రవళికకు వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో అశ్వాపురం మండలం మిట్టగూడెం వద్ద ప్రయాణికురాలు... ప్రవళికను కదులుతున్న బస్సులోంచి బయటకు తోసేసింది. దీంతో బస్సు వెనుక చక్రాల కింద పడి ఆమె కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం ఆమెను హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతూ ఆమె కన్నుమూశారు. ప్రవళిక మృతికి నిరసనగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బుధవారం బస్సుల బంద్‌కు, రాష్ట్రవ్యాప్తంగా నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు కావాలని ఆర్టీసీ కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి.

కండక్టర్ ప్రవళిక కుటుంబానికి 10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ఉద్యోగం

ప్రయాణికురాలి దాడిలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన టీజీఎస్ఆర్టీసీ మహిళా కండక్టర్ గుండ్ల ప్రవళిక (24) కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ మేరకు హామీ ఇచ్చారు. ప్రభుత్వం, ఆర్టీసీ తరఫున కలిపి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా, ప్రవళిక తల్లికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రి మార్చురీ వద్ద ప్రవళిక మృతదేహానికి మంత్రి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రవళిక కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

నేడు తెలంగాణ కేబినెట్ భేటీ

హైదరాబాద్, నవంబర్ 4 (ఈవార్తలు): ఈ నెల 5వ తేదీన తెలంగాణ కేబినెట్సమావేశం జరగనుంది. ఈ క్రమంలో కేబినెట్‌లో చర్చించే అజెండాపై సీఎస్ సంజయ్ జాజు సమీక్ష నిర్వహించారు. రేపు సాయంత్రం సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ భేటీ కానుంది. మధ్యాహ్నం 3 గంటలకు మంత్రులతో సీఎం అనధికార భేటీ నిర్వహించి, 4 గంటలకు అధికారికంగా కేబినెట్ సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ – 2026పై చర్చించనున్నారు.

సదర్.. తెలంగాణ ఆత్మగౌరవం

వేడుకల్లో సీఎం రేవంత్.. యాదవులకు కీలక హామీలు

హైదరాబాద్, నవంబర్ 4 (ఈవార్తలు): సదర్ సమ్మేళనం కేవలం యాదవ సోదరుల పండుగే కాదని, అది తెలంగాణ ప్రజలందరి ఆత్మగౌరవ సమ్మేళనమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించిన సదర్ ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై యాదవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యాదవుల చిరకాల కోరికను నెరవేరుస్తూ.. సదర్ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా అధికారికంగా ప్రకటిస్తున్నట్లు సీఎం వెల్లడించారు. వేడుకల నిర్వహణ కోసం రూ.5 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. గతంలో ఏ ముఖ్యమంత్రీ సదర్‌ను రాష్ట్ర పండుగగా ప్రకటించే ఆలోచన చేయలేదని రేవంత్ రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌లోని నేటి గోల్కొండ కోట ఒకనాటి 'గొల్లకొండ' అని, నగర అభివృద్ధిలో యాదవుల పాత్ర కీలకమని కొనియాడారు. తమ ప్రభుత్వంలో యాదవులకు సముచిత స్థానం కల్పించామని, అనిల్ కుమార్ యాదవ్‌కు రాజ్యసభ, నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యే పదవి ఇచ్చామని గుర్తుచేశారు.

ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డికి ఈడీ కస్టడీ

హైదరాబాద్, నవంబర్ 4 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ మద్యం రవాణా కుంభకోణం కేసులో దర్యాప్తు ముమ్మరమైంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డిని రెండు రోజుల పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీకి అనుమతిస్తూ నాంపల్లి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో అధికారులు అతడిని కస్టడీలోకి తీసుకుని విచారించనున్నారు. ప్రస్తుతం విజయవాడ జైలులో ఉన్న ఈశ్వర్ రెడ్డిని ఈడీ అధికారులు పీటీ వారెంట్‌పై నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు. అతడిని తమ కస్టడీకి ఇవ్వాలని కోరగా, న్యాయస్థానం రెండు రోజులకు అనుమతించింది. అంతకుముందు ఈశ్వర్‌కు ఈ నెల 16వ తేదీ వరకు కోర్టు రిమాండ్ విధించిన విషయం తెలిసిందే. ఏపీ లిక్కర్ స్కామ్‌లో ప్రధాన నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజ్ కెసిరెడ్డికి ఈశ్వర్ అత్యంత సన్నిహితుడని ఈడీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో, ఈ కుంభకోణంలో ఈశ్వర్ పాత్ర, జరిగిన ఆర్థిక లావాదేవీలు, తెరవెనుక ఉన్న ఇతర కీలక వ్యక్తుల ప్రమేయంపై ఈడీ అధికారులు లోతుగా ఆరా తీయనున్నారు. ఈ రెండు రోజుల విచారణలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని దర్యాప్తు వర్గాలు భావిస్తున్నాయి.



మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజానమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

మేట్లకు శిక్షణ.. గ్రామీణాభివృద్ధి పనులపై అవగాహన

ఉపాధి కూలీలకు సరిపడా నాణ్యమైన పనులు కల్పించడమే లక్ష్యం: ఎంపీడీవో శ్రీనివాస్



వేములవాడ రూరల్, నవంబర్ 4 (ఈవార్తలు): గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు తగిన పనులు కల్పించడంతో పాటు, అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో చేపట్టేలా మేట్లకు అవగాహన కల్పించడమే శిక్షణ లక్ష్యమని వేములవాడ రూరల్ ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం 'వీబీ-జీ రామ్ జీ' పథకం కింద మేట్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ పంచాయతీరాజ్ కమిషనర్, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మేట్లు శిక్షణకు హాజరయ్యారు. గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను ముందుగా గుర్తించి, పంచాయతీ తీర్మానాల ద్వారా ఆమోదించినట్లు ఎంపీడీవో వివరించారు. సాంకేతిక సహాయకులు, ఉపాధి హామీ సిబ్బంది, సహాయ కార్యక్రమ అధికారి సహకారంతో పనుల అంచనాలు రూపొందించి, ఉన్నతాధికారుల అనుమతులు పొందినట్లు తెలిపారు. రైతులకు ఉపయోగపడే రైతు కుంటలు, బోరుబావుల పునర్భరణ గుంతలు, వ్యక్తిగత, సామూహిక ఇంకుడు గుంతలు, వర్షపు నీటి నిల్వ నిర్మాణాలు, పశువుల షెడ్లు, తోటల పెంపకం, మహిళా సమాఖ్య భవనాల నిర్మాణాలు వంటి పనులను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మండలవ్యాప్తంగా పశువుల తాగునీటి అవసరాలను తీర్చేందుకు 25 చోట్ల నీటి తొట్టెల నిర్మాణాలను ప్రతిపాదించి, ఆమోదం కోసం ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు. త్వరలోనే అనుమతులు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులు పొలాల్లో రైతు కుంటలు నిర్మించుకోవడం ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకోవచ్చని, భూగర్భ జలాలను పెంచుకోవడంతో పాటు చేపల పెంపకం, కూరగాయల సాగు ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని వివరించారు. బోరుబావుల పునర్భరణ గుంతలతో నీరు భూమిలోకి ఇంకి నీటిమట్టం పెరగడానికి అవకాశం ఉంటుందన్నారు. అర్హులైన ప్రజలు వ్యక్తిగత ఇంకుడు గుంతలు, పశువుల షెడ్లు వంటి నిర్మాణాల కోసం తమ గ్రామ పంచాయతీ కార్యదర్శులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు. మేట్లు శిక్షణలో నేర్చుకున్న అంశాలను గ్రామాల్లో అమలు చేస్తూ, పనుల నాణ్యతకు ప్రాధాన్యమివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మల్లయ్య, సాంకేతిక సహాయకులు ఆర్. వెంకటయ్య, పి. కనకరాజు, ఈసీ శ్రీనివాస్, గ్రామాల క్షేత్ర సహాయకులు, మేట్లు పాల్గొన్నారు.

తేనీటి విందులో విప్ ఆది శ్రీనివాస్



వేములవాడ అర్బన్, నవంబర్ 4 (ఈవార్తలు): వేములవాడ 22వ వార్డు కౌన్సిలర్ ఇప్పపూల మమత అజయ్ ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ బుధవారం తేనీటి విందులో పాల్గొన్నారు. ఆమె కుటుంబ సభ్యులతో ముచ్చటించిన అనంతరం వార్డులో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా తాడూరి మహేష్, లక్ష్మి దంపతుల కుమార్తెలను ఆశీర్వదించి, వారు మంచి భవిష్యత్తును అందుకోవాలని ఆకాంక్షించారు. కౌన్సిలర్ ఇప్పపూల మమత అజయ్ కుమారుడిని కూడా పలకరించి ఆశీర్వదించారు. తన ఆహ్వానాన్ని మన్నించి విందుకు హాజరైన ప్రభుత్వ విప్‌కు మమత అజయ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేములవాడ మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, కాంగ్రెస్ నాయకులు చిలుక రమేష్, ఆత్మ కమిటీ చైర్మన్ ముకుందర్ రెడ్డి, మున్నూరు కాపు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోశెట్టి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణ్ గౌడ్ కుటుంబానికి కోటి పరిహారం ఇవ్వాలి

'ఉద్యమకారుల యాప్'ను వెంటనే ప్రారంభించాలి.. గన్‌పార్క్ వద్ద టీయూ జేఏసీ ధర్నా



హైదరాబాద్, నవంబర్ 4 (ఈవార్తలు): తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమంపై ప్రభుత్వం అలసత్వం వహిస్తోందని విమర్శిస్తూ తెలంగాణ ఉద్యమకారుల ఐక్య కార్యాచరణ సమితి (టీయూ జేఏసీ) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని గన్‌పార్క్ అమరవీరుల స్తూపం వద్ద ధర్నా నిర్వహించారు. జనగామ జిల్లా కొన్నే గ్రామానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు లక్ష్మణ్ గౌడ్ ఇటీవల ఆత్మహత్యకు పాల్పడిన ఘటనకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని టీయూ జేఏసీ నాయకులు ఆరోపించారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే రూ.కోటి ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర చైర్మన్ సుల్తాన్ యాదగిరి డిమాండ్ చేశారు. తెలంగాణ సాధన కోసం పోరాడిన ఉద్యమకారులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి రావడం బాధాకరమని ఆయన అన్నారు. ఉద్యమకారుల గుర్తింపు, వివరాల నమోదు కోసం 'ఉద్యమకారుల యాప్'ను వెంటనే ప్రారంభించాలని కోరారు. డిసెంబర్ 9 నాటికి అర్హులైన ఉద్యమకారులందరికీ తెలంగాణ ఉద్యమ ఫలాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో టీయూ జేఏసీ రాష్ట్ర నాయకులు అన్వర్ పటేల్, అనుముల రవీందర్, మోత్కూరు మల్లేష్, జి. యాదగిరి, రాజుగౌడ్, అంకం సతీష్, శ్రీశైలం, జాంబవ్, కృష్ణ, గిరి, రాజయ్య, అమరేందర్ గౌడ్, వి. అరుణ, లావణ్య, విజయలక్ష్మి, పుట్ట రంజిత్, అమృత్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

రూ.175 కోట్ల నిధుల కేటాయింపు.. పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం: అడ్లూరి



జగిత్యాల, నవంబర్ 4 (ఈవార్తలు): పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. బుధవారం ధర్మపురి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు సుమారు రూ.45 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో సంక్షేమ పథకాలను నిరంతరాయంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. కళ్యాణలక్ష్మి పథకాన్ని నిలిపివేస్తారంటూ బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారంలో నిజం లేదన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలతో పేద కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు. ధర్మపురి నియోజకవర్గంలో ఇప్పటివరకు 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.175 కోట్ల నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనబట్ల దినేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి రాజేష్, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పుస్తెలతాడు చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్



మల్యాల, నవంబర్ 4 (ఈవార్తలు): మహిళ మెడలోని బంగారు పుస్తెలతాడును లాక్కొని పరారైన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మల్యాల సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. నవంబర్ 3న గంగారం తండాకు చెందిన అజ్మీర దూరి (50) సూరంపేట గ్రామ శివారులోని ఐకేపీ కేంద్రానికి వడ్ల ఆరబెట్టేందుకు వెళ్తుండగా, బైక్‌పై వచ్చిన ముగ్గురు ఆమె మెడలోని సుమారు రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడును లాక్కొని పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదుతో కొడిమ్యాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నవంబర్ 4 (ఈవార్తలు)న నాచుపల్లి ఇటుక బట్టీల సమీపంలో అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా, చోరీకి పాల్పడినట్లు గుర్తించామని సీఐ తెలిపారు. వారి నుంచి బంగారు పుస్తెలతాడు, నేరానికి ఉపయోగించిన హెచ్ఎఫ్ డీలక్స్ బైక్, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఆ బైక్ తిప్పన్నపేటలో చోరీకి గురైన వాహనంగా గుర్తించినట్లు చెప్పారు. అరెస్టయిన వారిలో కోరుట్లకు చెందిన గణేష్‌తో పాటు ఇద్దరు మైనర్లు ఉన్నారని సీఐ వెల్లడించారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

కండక్టర్ ప్రవళిక మృతిపై ఆర్టీసీ యూనియన్ సంతాపం



హైదరాబాద్, నవంబర్ 4 (ఈవార్తలు): ఆర్టీసీ కండక్టర్ ప్రవళిక మృతి అత్యంత హృదయవిదారకమని ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌డబ్ల్యూయూ) కార్యనిర్వాహక అధ్యక్షుడు గొడిశాల అబ్రహం అన్నారు. బుధవారం నారాయణగూడలోని ఐఎన్‌టీయూసీ భవనంలో ఉన్న యూనియన్ కార్యాలయంలో ప్రవళిక మృతికి సంతాపం తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న ప్రవళికను బస్సులోని ఓ ప్రయాణికురాలు కిందకు తోసివేయడంతో తీవ్రంగా గాయపడిందని, పది రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నవంబర్ 3 రాత్రి మృతి చెందిందని అబ్రహం పేర్కొన్నారు. ప్రజలకు సేవలందించే మహిళా ఉద్యోగిపై ఇటువంటి దాడి జరగడం ఆందోళనకరమన్నారు. ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ సిబ్బందికి, ముఖ్యంగా మహిళా ఉద్యోగులకు తగిన రక్షణ కల్పించాలని కోరారు. ప్రవళిక కుటుంబానికి ఆర్టీసీ యాజమాన్యం తక్షణమే ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సయ్యద్ మహమూద్, బి. హనుమంతరావు, చంద్రయ్య, విజయబాబు, ఛాయాదేవి, శాంతకుమారి, జయ, అశ్విని తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలి: ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల, నవంబర్ 4 (ఈవార్తలు): రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం జగిత్యాలలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని మండలాల ఎంపీడీవోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన లబ్ధిదారులను పారదర్శకంగా గుర్తించి, త్వరితగతిన మంజూరు పత్రాలు అందజేయాలని సూచించారు. గుడిసెలు లేని తెలంగాణ లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన లక్ష్యమన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవోలు చిరంజీవి, రమాదేవి, నీరజ, భీమేష్, ఎంపీవో వాసవి పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు: సంజయ్ కల్వకుంట్ల

జగిత్యాల, నవంబర్ 4 (ఈవార్తలు): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తును సాధించవచ్చని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల అన్నారు. బుధవారం మల్లాపూర్ మండలం కొత్త దాంరాజ్‌పల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఏలేటి మహేష్‌రెడ్డి బృందం ఆధ్వర్యంలో టీ-షర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి దామోదర్‌రెడ్డి, ఎంపీడీవో శ్రీకాంత్, బీఆర్ఎస్ నాయకులు ఏలేటి మహేష్‌రెడ్డి, ఉపసర్పంచ్ హరీష్‌రెడ్డి, కాటిపెల్లి ఆదిరెడ్డి, పన్నాల శేఖర్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, తిట్ల రాజేష్, రాఘవపేట సర్పంచ్ తోట శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, సుధాకర్, కార్యదర్శి కీర్తి దివ్య తదితరులు పాల్గొన్నారు.



రాజన్న ఆలయ నిత్యాన్నదానం ట్రస్టుకు రూ.1.50 లక్షల విరాళం

వేములవాడ అర్బన్, నవంబర్ 4 (ఈవార్తలు): కామారెడ్డికి చెందిన బెజుగం శ్రీకాంత్‌రెడ్డి, మంగని సంధ్యారాణి దంపతులు వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి దేవస్థానం నిత్యాన్నదానం ట్రస్టుకు రూ.1.50 లక్షలు విరాళంగా అందజేశారు. బెజుగం లింగారెడ్డి కుమారుడైన శ్రీకాంత్‌రెడ్డి దంపతులు బుధవారం ఆలయ ప్రోటోకాల్ కార్యాలయంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి రమాదేవిని కలిసి నగదు విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనం చేశారు.



రాజన్న ఆలయానికి రూ.5 లక్షల విలువైన వెండి కానుక

వేములవాడ అర్బన్, నవంబర్ 4 (ఈవార్తలు): వరంగల్‌కు చెందిన తనుగుల రత్నాకర్, అన్నపూర్ణ దంపతులు వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారికి సుమారు రూ.5 లక్షల విలువైన వెండి వస్తువులను కానుకగా సమర్పించారు. తమ కుమారుడు జయంత్ పేరిట సుమారు రెండు కిలోల బరువున్న వెండి గంప, బిందె, పళ్లెం తయారు చేయించి స్వామివారికి అందజేశారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో కార్యనిర్వహణాధికారి రమాదేవికి ఈ వస్తువులను అందించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ ఈవో ప్రతాప నవీన్‌కుమార్‌తో పాటు ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. వెండి కానుకల విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు.



బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ముస్త్యాల వెంకటేష్

బన్సీలాల్ పేట్, నవంబర్ 4 (ఈవార్తలు): బన్సీలాల్ పేట్ డివిజన్‌లోని బండమైసమ్మ నగర్‌కు చెందిన ముస్త్యాల వెంకటేష్ బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు క్రాంతి కిరణ్, సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు నవీన్ కుమార్ ఆయనకు నియామక పత్రం అందజేసి అభినందించారు. జిల్లా కార్యవర్గంలో అవకాశం కల్పించినందుకు కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, క్రాంతి కిరణ్, నవీన్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్. రాజు, సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ టి. రాజశేఖర్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సురేష్ కుమార్, బీజేపీ జిల్లా కమిటీ సభ్యుడు సత్యనారాయణకు వెంకటేష్ కృతజ్ఞతలు తెలిపారు.

టీజేఎఫ్ నేత రవీందర్‌రావుకు రాష్ట్ర నాయకుల పరామర్శ

జగిత్యాల, నవంబర్ 4 (ఈవార్తలు): తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి మేన్నేని రవీందర్‌రావును ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ప్రధాన కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్ పరామర్శించారు. బుధవారం జగిత్యాల పట్టణంలోని రవీందర్‌రావు నివాసానికి వెళ్లిన రాష్ట్ర నాయకులు ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గత నెల రోజులుగా అనారోగ్య సమస్యలతో చికిత్స పొందుతున్న ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఇమ్రాన్, ఉపాధ్యక్షులు కాసం శ్రీనివాస్‌రెడ్డి, రాగం రమేశ్, సహాయ కార్యదర్శి అనంతుల కాంతారావు, కోశాధికారి మేన్నేని శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యుడు గోపాటి నరేందర్‌రావు, జాతీయ కౌన్సిల్ సభ్యుడు జయపాల్, నాయకులు తిరునగరి శ్రీనివాస్, ఎం. నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



రౌడీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై నిఘా

